సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: ఆరోగ్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తన కార్యాయంలలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. పట్టణంలోని 17వ వార్డుకు చెందిన ఉప్పలంచి వీరేష్‌కు రూ. 10,500, సాజిదాబేగంకు రూ. 21 వేలు మంజూరీ అయ్యాయి. ఆ చెక్కులను ఆయన తన నివాసంలో వారికి అందజేశారు. కౌన్సిలర్ అర్చన సందీప్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు మహేష్, సంతోష్‌గౌడ్, రేవంత్, సాయిరెడ్డి, బాబు, అంజాద్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లోని శ్రీ గోదాసమేత మన్నార్ రంగనాయక స్వామి ఆలయంలో ఆదివారం బ్రహ్మోత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు నిర్వహించిన పూజల్లో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొన్నారు. ఈ నెల 11వ తేదీన బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

అదనపు బాధ్యతలు..
అటకెక్కిన పర్యవేక్షణ!



13 మండలాలకు ఇన్‌చార్జ్ ఎంఈఓలు

- ఒక హెచ్ఎంకు ఆరు మండలాలు
- మరో హెచ్ఎంకు ఏడు మండలాలు
- మందగిస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పర్యవేక్షణ.. విద్యా ప్రగతి పనులు
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇలానే...
- పట్టించుకోని విద్యాశాఖ.. ఇబ్బందుల్లో పాఠశాల ప్రగతి
- జిల్లాలో 1500 ప్రైవేట్, 507 ప్రభుత్వ పాఠశాలలు

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పర్యవేక్షణ, విద్యా ప్రగతిని సమీక్షించే మండల విద్యాశాఖ అధికారులు బాధ్యతలు నిర్వహిస్తున్న వారే ఉండటంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. జిల్లాలో మొత్తంగా 15 మండలాలు ఉండగా, ఉప్పల్, బాలానగర్ మండలాలు మినహాయించి, మిగతా 13 మండలాలకు ఇద్దరు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా ఆరు నుంచి ఏడేసీ మండలాల బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. రెండు మండలాలకు నియమితులైన ఇద్దరు ఎంఈఓలు కూడా సాధారణ బదిలీల్లో భాగంగా ఇటీవల బాధ్యతల్లో చేరారు. మరో వైపు హెచ్ఎంలు ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా తాను పని చేస్తున్న పాఠశాలతో పాటు ఆరుకు పైగా మండలాల్లో విద్యాశాఖ బాధ్యతలను నిర్వహించటం తలకు మించిన భారంగా మారుతోంది.

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 13 మండలాలకు ఇద్దరు ఇన్‌చార్జ్ ఎంఈవోలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కో ఇన్‌చార్జ్ ఎంఈఓ ఆరు నుంచి ఏడు మండలాల బాధ్యతలను నిర్వహిస్తుండటంతో వారికి తలకు మించిన భారంగా మారుతోంది. దీనికి సొంత పాఠశాల బాధ్యతలను కూడా చూసుకోవాల్సి రావటం కష్టతరంగా మారుతోంది.
- కీసర పాఠశాల ప్రధానోపాధ్యాయులు శశిధర్ ఇన్‌చార్జ్ ఎంఈఓగా ఆరు మండలాలు కీసర, ఘట్‌కేసర్, కాప్రా, మేడిపల్లి, మల్కాజిగిరి, అల్వాల్ బాధ్యతలు చూస్తున్నారు.
- తూముకుంట ప్రధానోపాధ్యాయురాలు వసంతకుమారి ఏడు మండలాలైన మేడ్చల్, శామీర్‌పేట, మూడుచింతలపల్లి, కుత్బుల్లాపూర్, బాచుపల్లి, దుండిగల్, కూకట్‌పల్లి బాధ్యతలను నిర్వహిస్తున్నారు.
- దీంతో విద్యా ప్రగతి కుంటుపడుతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే మండలానికి ఒక ఎంఈఓ నియామకంపై విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పేరుకుపోయిన సమస్యలివీ...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 1500 ప్రైవేటు పాఠశాలలు, 507 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. డొనేషన్లు, అధిక ఫీజులు వసూళ్లతోపాటు బడిలోనే పాఠ్య, నోట్ పుస్తకాలు, స్కూల్ దుస్తుల విక్రయాలు ఇష్టమొచ్చిన ధరలతో విక్రయిస్తున్నారు. ఈ విషయంలో విద్యాశాఖ నియంత్రణ లేకుండా పోతోంది. అలాగే విద్యాశాఖ అనుమతి లేకుండా పదులు సంఖ్యలో ప్రైవేట్ పాఠశాలలు నడుస్తున్నా పట్టించుకోని పరిస్థితి నెలకొంటోంది. ఇరుకైన గదులు, బహుళ అంతస్తు భవనాల్లో ఎలాంటి భద్రత చర్యలు లేకుండా కొనసాగుతున్న ప్రైవేట్ పాఠశాలలను విద్యాశాఖ నియంత్రించ లేకపోతోంది. ఆట స్థలాలతో పాటు ఏదైనా ప్రమాదం జరిగినా... అగ్ని ప్రమాదాలు సంభవించినా.. నివారణ చర్యలు తీసుకోవటానికి వీలులేకుండా ఉన్న భవనాల్లో ప్రైవేట్ పాఠశాలలు కొనసాగుతున్నా పట్టించుకునే నాథులే కరవయ్యారు.

- ప్రభుత్వ పాఠశాలల్లో చాలా చోట్ల ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదు. బయోమెట్రిక్ లేకపోవడంతో ఆలస్యంగా విధులకు హాజరవుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇన్‌చార్జ్ ఎంఈవోలు పాఠశాల సముదాయ సమావేశాలు, మండల, జిల్లా సమీక్ష సమావేశాలకు వెళ్లాల్సి ఉండటంతో తనిఖీలు నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఒకటిన్నర నెల దాటినా ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందని పరిస్థితి నెలకొంది.
- మధ్యాహ్న భోజన పథకంపై పర్యవేక్షణ లేక నాణ్యత లోపిస్తోంది. మన బడి–మన పల్లె–మన బస్తీ, అమ్మ ఆదర్శ కమిటీల అధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న ప్రగతి



పనుల పురోగతి ఆందోళన కలిగిస్తోంది. తొలి మెట్టు, ఉన్నతి వంటి కార్యక్రమాల అమలుపై నిర్లక్ష్యం కనిపిస్తోంది. విద్యార్థుల్లో నానాటికీ సామర్థ్యాలు పడిపోతున్నాయి. విద్యాప్రగతి లేని చోట ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం లేదు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం



జిల్లాలోని 13 మండలాల్లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఇన్‌చార్జ్ ఎంఈవోలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. పాఠశాలలపై పర్యవేక్షణలో ఎలాంటి ఇబ్బంది లేదు. ఎంఈవోలు తమ పరిధిలోని పాఠశాలల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నాం.

– ఐ.విజయకుమారి, డీఈవో, మేడ్చల్–మల్కాజిగిరి

నేటి నుంచి కీసరగుట్టలో శ్రావణమాస పూజలు



రామలింగేశ్వర స్వామి

కీసర: ప్రఖ్యాత శైవ క్షేత్రమైన కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం నుంచి శ్రావణ మాస ప్రత్యేక పూజలు ప్రారంభం కానున్నాయి. నగరంలోని పలు ప్రాంతాల నుంచి పూజా కార్యక్రమాలకు వచ్చే భక్తులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను ఆలయ కమిటీ పూర్తి చేసింది. ఏటా నిర్వహించినట్లే ఈ ఏడాది కూడా నెల రోజుల పాటు శ్రావణ మాస పూజలు కొనసాగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ తటాకం నాగలింగంశర్మ, కార్యనిర్వహణాధికారి కె.సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 5న మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, క్షీరాభిషేకంతో పూజలు ప్రారంభమై సెప్టెంబర్ 2న తైలాభిషేకం, అన్నాభిషేకం వంటి పూజాధికాలతో ముగుస్తాయన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు తీసుకోవాలని కోరారు.

ఎంపీ ఈటలకు ఎమ్మార్పీఎస్ నేతల సన్మానం



ఈటలను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

మేడ్చల్: ఎస్సీ వర్గీకరణ చేయాలని సుప్రీంకోర్టు తీర్పు వెలువరచడంతో తమకు మద్దతు తెలిపిన బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌ను మండల ఎమ్మార్పీఎస్ నాయకులు కలిశారు. పూడూర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి ఆయనను సన్మానించారు. ఈటల రాజేందర్ ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి మొదటి నుంచి అండగా ఉన్నారని అలాంటి నాయకుల మద్దతుతో మంద కృష్ణ మాదిగ మూడు దశాబ్దాలుగా పోరాటం చేశారని గుర్తుచేశారు. తమకు అండగా ఉన్న ఎంపీ ఈటలకు నాయకులు ధన్యవాదాలు తెలిపారు. నాయకులు ఎన్.వై.అశోక్, పరశురాం, రాంచందర్, శివకుమార్, శివ, శంకర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు



సాధించిన పతకాలతో విద్యార్థులు

మేడ్చల్: సికింద్రాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మేడ్చల్‌కు చెందిన 369 కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్–10 విభాగంలో అకాడమీకి చెందిన ఆరుగురు విద్యార్థులు, అండర్–14 విభాగంలో ఒకరు, అండర్–14 విభాగంలో ఒకరు బంగారు పతకాలు సాధించారు. మరికొంతమంది విద్యార్థులు సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. సినీ హీరో ఇంద్రసేన, అకాడమీ కోచ్ సాయికుమార్, కోచ్‌లు విద్యార్థులను అభినందించి సన్మానించారు.

అ'పూర్వ' సమ్మేళనం



శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం ఉద్దమర్రి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా కలిసి సందడి చేశారు. పాఠశాలలో పదవ తరగతి 2005–06 విద్యా సంవత్సరం విద్యార్థులు ఆదివారం కేశవరంలోని సంగీత ఫంక్షన్‌హాల్‌లో సమ్మేళనం నిర్వహించి ఒక్కచోటికి చేరారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజులను నెమరువేసుకుని ఆనందంగా గడిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కుత్బుల్లాపూర్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వివిధ బస్తీల ప్రజలు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నేత కూన శ్రీశైలం గౌడ్‌ను షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో ఆదివారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతి



మంత్రిని సన్మానించిన ఘట్‌కేసర్ నాయకులు

ఘట్‌కేసర్: పట్టణంలోని నారాయణ గార్డెన్ నుంచి లక్కీ వైన్స్ వరకు బీటీ రోడ్డ నిర్మించాలని, అందుకు సుమారు రూ. 70 లక్షల నిధులు కేటాయించాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఘట్‌కేసర్ నాయకులు కోరారు. ఆదివారం ఘట్‌కేసర్‌లోని ఓఆర్ఆర్ టోల్ ప్లాజా వద్ద కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో మంత్రిని సన్మానించారు. రైల్వే వంతెన నిర్మాణం పూర్తిచేయాలని విన్నవించడంతో అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణతో నెరవేరిన దళితుల కోరిక



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్‌కుమార్

ఘట్‌కేసర్: ఎస్సీ వర్గీకరణ ప్రక్రియకు మార్గం సుగమం కావడంతో దళితుల దశాబ్దాల కోరిక నెరవేరిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పంగా ప్రణయ్‌కుమార్ అన్నారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం ఘట్‌కేసర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ... ఎమ్మార్పీఎస్ కృషితో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ మొదలైందన్నారు. అంబేడ్కర్ అభిమాన సంఘ సభ్యులు మేకల దాస్, నర్సింగ్‌రావు, బండారి రాందాస్, సగ్గు శివకుమార్, నగేష్, ఎం.శ్రీనివాస్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మానమన్నందుకు ఆత్మహత్య



సాయికుమార్ గౌడ్ (ఫైల్)

పోచారం: మద్యం మానమని కుటుంబ సభ్యులు చెప్పినందుకు ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం... పోచారం మున్సిపాలిటీకి చెందిన నోముల సాయికుమార్‌గౌడ్(33) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య ప్రవళి, ఇద్దరు పిలలు ఉన్నారు. సాయికుమార్ మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. మద్యం మానమని ఎంత చెప్పినా పట్టించుకోలేదు. శనివారం రాత్రి మద్యం తాగి రావడంతో ఎందుకు తాగావని భార్య నిలదీసింది. దీంతో పడక గదిలోకి వెళ్లి పడుకున్నాడు. ఆదివారం ఉదయం చూసేటప్పటికే చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


తాగునీరు వృథా



నాచారం ఈఎస్ఐ ఆసుపత్రి వద్ద వృథాగా పోతున్న తాగునీరు

మల్లాపూర్ : నాచారంలో పలుచోట్ల తాగునీటి లీకేజీల పర్వం కొనసాగుతోంది. తాగునీరు రోడ్ల పాలవుతోంది. నీటి వృథాపై జలమండలి అధికారులు తగిన చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వెలువడుతున్నాయి. దీంతో నాచారం ఈఎస్ఐ ఆసుపత్రి ప్రధాన రోడ్డులో గత పదిరోజులుగా పైపులైన్ పగిలి తాగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీనిపై జలమండలి అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

లారీ డ్రైవర్ అజాగ్రత్త



జీడిమెట్ల: లారీ డ్రైవర్ అజాగ్రత్తగా రివర్స్ తీస్తూ వెనుక వస్తున్న కారును ఢీకొట్టడంతో కారులోని నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ తెలపిన వివరాల ప్రకారం.. సాయిబాబానగర్‌కు చెందిన నవీన్, భాను, ప్రసాద్, మోహన్ ఆదివారం ఉదయం స్విఫ్ట్ కారులో సుభాష్‌నగర్ నుంచి సాయిబాబానగర్ వైపు వెళ్తున్నారు. గతి ట్రాన్స్‌పోర్ట్ వద్దకు చేరుకోగానే ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన లారీ కంటైనర్ డ్రైవర్ అజాగ్రత్తగా రివర్స్ తీస్తూ కారును ఢీకొట్టడంతో అందులోని నలుగురు గాయపడ్డారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి గొలుసు స్నాచింగ్

మేడ్చల్‌రూరల్: ఇంటి వద్ద ఉన్న వృద్ధురాలి వద్దకు లోన్ ఇస్తామంటూ వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు మహిళను మాటల్లో పెట్టి తన మెడలోని బంగారు గొలుసుతో పరారయ్యారు. ఈ సంఘటన మేడ్చల్ మండలంలోని డబిల్‌పూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గుళ్లయ్యగారి సుక్కమ్మ(60) ఇంటి వద్ద ఉంటుంది. కుమారుడు బేకరి షాప్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం సుక్కమ్మ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి మీకు లోన్ ఇస్తామంటూ మాయమాటలు చెబుతూ ఒక్కసారిగా ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు చైన్‌ను లాక్కుని బైక్‌పై పరారయ్యారు. బాధితురాలు అరుపులతో స్థానికుల వచ్చి విషయం తెలుసుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫామ్‌హౌస్‌లో యువకుడి అనుమానాస్పద మృతి



మృతుడు సందీప్‌రెడ్డి

కీసర: ఫామ్‌హౌస్‌లో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య సమాచారం మేరకు... యాద్గార్‌పల్లి గ్రామ పరిధిలోని సిద్ధార్థ ఫామ్‌హౌస్‌లో శనివారం రాత్రి పార్లేజీ కంపెనీలో పనిచేస్తున్న 12 మంది ఉద్యోగులు గెట్ టు గెదర్ పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా పార్టీ కోసం రాయల్ స్టాగ్ విస్కీతో పాటు కింగ్‌ఫిషర్ బీర్ల కార్టన్‌ను తీసుకొచ్చారు. వీరిలో రాగిడి సందీప్‌రెడ్డి(29) స్విమ్మింగ్ పూల్‌లో మునిగి మృతి చెందాడు. ఆదివారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. స్విమ్మింగ్‌పూల్‌లో నాచు పట్టకుండా కెమికల్ కలుపుతారని.. మద్యం మత్తులో ఆ నీటిని తాగి మరణించి ఉంటాడా అని పోలీసులు అనుమానిస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలోని జిల్లికుంట గ్రామానికి చెందిన సందీప్‌రెడ్డి కాప్రాలోని ఎల్లారెడ్డిగూడలో ఉంటూ పార్లేజీ డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేస్తున్నాడు. తోటి ఉద్యోగులతో ఏమైనా గొడవపడి చనిపోయాడా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.

నిషేధిత ఇంజక్షన్లు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

పోచారం: నిషేధిత ఇంజక్షన్లు విక్రయిస్తున్న వ్యక్తిపై పోచారం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రాజు సమాచారం మేరకు... చౌదరిగూడలోని మక్త వద్ద నిషేధిత ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. వాటర్ ఫిల్టర్ వ్యాపారం చేస్తున్న ముంత రంగయ్య(58) వద్ద పశువులకు ఇచ్చే ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు లభించాయి. దీంతో అతన్ని అదుపులోకి తీసుకొని, 135 బాటిల్స్ ఆక్సిటోసిన్ ఇంజక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తున్నారు.

వైభవంగా బోనాల జాతర



బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ, పోచారం, రాజీవ్ గృహకల్ప, సంస్కృతి టౌన్‌షిప్, ఎల్ఐజీ, అన్నానగర్, యంనంపేట్ తదితర ప్రాంతాల్లో బోనాల వేడుకలను ప్రజలు అత్యంత వైభవంగా ఆదివారం జరుపుకొన్నారు. రేణుకా ఎల్లమ్మ, నల్ల పోచమ్మ తదితర ఆలయాల్లో మహిళలు బోనాలు సమర్పించారు. పోచారంలోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో మాజీ మంత్రి, శాసన సభ్యుడు చామకూర మల్లారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజలందరికీ మంచి జరగాలంటూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, కౌన్సిలర్ మెట్టు బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు మందడి సురేందర్‌రెడ్డి, ఎస్‌వైఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సామల సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులను ఆదుకోవాలి

రంగారెడ్డినగర్: కేరళలోని వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడి వరదతో నష్టపోయిన బాధితులను ఆదుకుందామని కుత్బుల్లాపూర్ సీపీఎం కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ పిలుపునిచ్చారు. మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్‌లో ఆదివారం విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బీభత్సంలో అనేక గ్రామాలు నామరూపాలు లేకుండా పోయాయని, వందలాది మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. అలాగే పౌరులు ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నాయన్నారు. సభ్యులు సత్యం, శంకర్, రావుల స్వాతి, సీఐటీయూ నాయకులు శీను, కరుణాకర్, మల్లారెడ్డి, కృష్ణ, ఏసు, పాషా పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయం వద్ద అన్నదానం

కుత్బుల్లాపూర్: సూరారం డివిజన్ షాపూర్‌నగర్‌లోని అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం అన్నదానం నిర్వహించారు. కాంగ్రెస్ నేతలు చొడ శ్రీనివాసరావు, ఎన్ఎస్‌యూఐ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కూన రాఘవేంద్రగౌడ్ హాజరై పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీనియర్ నాయకుడు శ్రీనివాస్, బీజేపీ నేత ఎం.ఎస్. వాసు, గుబ్బల లక్ష్మీనారాయణ, కాలనీ అసోసియేషన్ సభ్యులు, విజయ గణపతి వెజిటేబుల్ మార్కెట్ కమిటీ సభ్యులు ఆంజనేయులు, వీరబాబు, అరుణ్, మహేశ్, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల్లో చేర్పులు ఏవీ!

- కొత్త రేషన్ కార్డులు కాదు మ్యూటేషన్లకూ దిక్కే లేదు
- మేడ్చల్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న మ్యూటేషన్ల దరఖాస్తులు 86,885
- ప్రభుత్వ ఆదేశాలు రాగానే పరిష్కరిస్తామంటున్న అధికారులు

పీర్జాదిగూడలో నివాసం ఉండే రవికాంత్ ఐదేళ్ల కిందట తన బాబు పేరు రేషన్ కార్డులో చేర్చాలని మీ–సేవలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం తన రెండో బాబు వివరాల నమోదు కోసం మీ–సేవ కేంద్రానికి వెళ్లారు. పాతది పెండింగ్‌లో ఉన్నందున ఈ వివరాలు నమోదు చేస్తే దరఖాస్తు తీసుకోవడం లేదు. ఇదే పరిస్థితి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోనే కాదు అంతటా నెలకొని ఉంది.



సాక్షి, సిటీబ్యూరో: ఆరేళ్లుగా మీ–సేవ కేంద్రంలో రెండో బిడ్డ వివరాలు చేర్చేందుకు అవకాశం లేకుండా పోయింది. కనీసం దరఖాస్తు చేసుకోవటానికి కూడా వీల్లేదు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రస్తుతం 5.24 లక్షల రేషన్ కార్డులు (ఆహార భద్రత కార్డులు) ఉండగా, ఇందులో 17.20 లక్షల మంది సభ్యులు ఉన్నారు. తమ పిల్లల పేర్లను ఆహార భద్రత కార్డులో నమోదు కోసం మీ–సేవ కేంద్రాల్లో 86,885 మంది దరఖాస్తు చేసుకోగా, ఆరేళ్లుగా అపరిష్కృతంగానే ఉంటున్నాయి. ఇందులో బాలానగర్–1లో 35,735 దరఖాస్తులు ఉండగా, బాచుపల్లిలో 1260, గండిమైసమ్మ దుండిగల్‌లో 2,669, ఘట్‌కేసర్‌లో 2,731, కాప్రాలో 3,688, కీసరలో 3,388, మేడ్చల్‌లో 2,657, మేడిపల్లిలో 3,169, ఉప్పల్–2లో 29,264, శామీర్‌పేట మండలంలో 2,324 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోగా.. ప్రస్తుత ప్రభుత్వం చర్యలు సైతం శూన్యంగానే ఉన్నాయి.

లక్షకు పైగా దాటేవి..

పదేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం ఆహారభద్రత కార్డులు జారీ చేసింది. తర్వాత రెండు సార్లు కొత్త కార్డులు జారీ చేసి చేతులు దులుపుకొంది. సభ్యుల వివరాలు కార్డుల్లో చేర్పించేందుకు అవకాశం కల్పించలేదు. కానీ పేర్లను చేర్చేందుకు మీ–సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దరఖాస్తు చేసుకున్నా వారి పేర్లు ఇప్పటికీ కార్డుల్లోకి ఎక్కలేదు. వారికి రెండో సంతానం పుట్టగా నమోదు చేసుకునేందుకు మీ–సేవ కేంద్రాలకు వెళ్తే మొదటి దరఖాస్తే పెండింగ్‌లో ఉన్నందున రెండోది తీసుకోవడం లేదు. ఇలాంటి వారికి అవకాశమిస్తే దరఖాస్తులు లక్షకు పైగా చేరేవి. ఈ విషయంపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.